Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 339 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 21 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## ఆటవిక పాలన నుంచి అభివృద్ధికి బాటలు వేశాం : మోదీ



**పాట్నా:** బీహార్‌ను ఆటవిక రాజ్యంలోని నెట్టిన ఘనత కాంగ్రెస్, ఆర్జేడీలదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారని, ఇప్పుడు ఎన్డీయే హయాంలో బీహార్ బలమైన అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. బీహార్‌లోని సివాన్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, రాష్ట్రం దశాబ్దాలుగా పేదరి కంలో మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణ మని అన్నారు. ఎన్డీయే హయాంలో సాధించిన కీలక విజయాలను ప్రధాని ప్రస్తావిస్తూ, 55,000 కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశామని, 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్ ఇచ్చామని, 26 కోట్ల మందికి పైపుల ద్వారా తాగునీటిని అందించామని చెప్పారు. బీహార్‌ను ఆటవిక రాజ్యంగా మార్చిన వారు తమ తప్పిదాలను పునరావృ తం చేయాలనుకుంటున్నారని, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు.

**పేదలకు మరిన్ని ఇళ్లు**

పేదలకు మరో మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజలే తన కుటుంబ సభ్యులనీ, కుటుంబంలోని ఏ ఒక్కరూ కడగండ్లపాలు కాకుండా చూస్తామని, వారి కోసం రేయింబవళ్లూ శ్రమిస్తామని, తమ కల నిజమయ్యేంత వరకూ విశ్రాంతి తీసుకునేది లేదని చెప్పారు. బీహార్ స్వాతంత్ర్య సమరయోధుల గడ్డ అని ప్రశంసించారు. భారతదేశం గ్లోబల్ పవర్‌గా ఎదగడంలో బీహార్ కీలక భూమిక వహిస్తోందని చెప్పారు. భారతదేశం శీఘ్రగతిన పురోగమిస్తుండటంపై ప్రపంచ దేశాలు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, త్వరలోనే ప్రపంచలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలువనుందని వారు బలంగా నమ్ముతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పలు హౌసింగ్, వాటర్, రైల్, పవర్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లోని పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పీఎంఏవై-యూ) కింద 6,600 మంది లబ్ధిదారులకు తాళం చెవులు అందజేశారు. పీఎంఏవై-యూ లబ్ధిదారులకు తొలి విడత ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ.536 కోట్లు విడుదల చేశారు. మర్హౌరా ప్లాంట్‌లో తయారైన లోకోమోటివ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎవరి కోసమో తెలంగాణ హక్కులు వదులుకోం : రేవంత్‌రెడ్డి



**ఢిల్లీ:** గోదావరి – బనకచర్లపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తాము ఎవరితో వివాదాలు కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ నెల (జూన్) 23వ తేదీ తెలంగాణ కేబినెట్ సమావేశం జరుగుతుందని... ఈ భేటీలో చర్చించిన తర్వాత చంద్రబాబును చర్చలకు ఆహ్వానిస్తామని తెలిపారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై తెలంగాణని ఏపీ మొదట ఎందుకు సంప్రదించలేదని ప్రశ్నిచారు. కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించడమే తమ అభ్యంతరమని తెలిపారు. ఏపీ విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని వివరించారు. ఢిల్లీలో ఇవాళ (శుక్రవారం) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఎవరితోనూ తాము వివాదం కోరుకోవడం లేదని.. ఎవరికోసమో తెలంగాణ హక్కులు వదులుకోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణాజిల్లాలో 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్‌ఓసీకి తాను అడిగినందుకు మాజీ మంత్రి హరీష్‌రావు తప్పుపడుతున్నారని.. హరీష్‌రావు వాదనలో పస లేదని చెప్పారు. 2023లో కేంద్రానికి హరీష్‌రావు రాసిన లేఖలో కేవలం 405 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు అడిగారని గుర్తుచేశారు. తెలంగాణలో తమ ప్రాజెక్ట్‌లు పూర్తయి, పూర్తిస్థాయిలో నీటిని వినియోగించుకున్న తర్వాత ఆంధ్రప్రదేశ్ వారి ప్రాజెక్టుల గురించి ఆలోచించాలని కోరారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. నీళ్లు, నిధుల పేరిట మోసపూరిత సెంటిమెంట్‌ని గతంలో బీఆర్ఎస్ నేతలు అడ్డుపెట్టుకున్నారని.. ఇప్పుడు జలాలను సంజీవని అని భావిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పు చేసిందని మండిపడ్డారు. గతంలో ఏపీకి అన్ని హక్కులు రాసిచ్చారని ఆరోపించారు. రాయలసీమను రత్నాలసీమ చేస్తానని మాజీ సీఎం కేసీఆర్ అన్నారని.. మరీ ఇప్పుడు గోదావరి జలాలను ఏపీ ఉపయోగించుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా 50 వేల ఎకరాలకు మాత్రమే నీరు అందించారని చెప్పారు. ఈ ఏడాదిలో తెలంగాణలో పండిన అత్యధిక పంటలకు కాళేశ్వరం నీళ్లకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను ఏపీకి రాసిచింది కేసీఆర్, హరీష్‌రావులే అని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు.

## ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల..ఇక్కడ చెక్ చేసుకోండి

### - విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈరోజు (శుక్రవారం) విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఫలితాలను సోషల్ మీడియా ఎక్స్ వేదికగా విడుదల చేశారు. గణితం, భౌతిక శాస్త్రాలు, సామాజిక అధ్యయనాలు, జీవ శాస్త్రం, ఇంగ్లీష్ ఇలా మొత్తం ఐదు విభాగాల్లో 99.42 శాతం అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మొత్తం 17,795 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా..వారిలో 14,527 మంది అర్హత సాధించారని మంత్రి వెల్లడించారు. ర్యాంక్ కార్డులను https://cets.apsche.ap.gov.in/EDCET/Edcet/EDCET_GetRankCard.aspx లో చూసుకోవచ్చు. ఈ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్‌టికెట్ నెంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేసి ర్యాంక్ కార్డును తెలుసుకోవచ్చు. అలాగే మన మిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా ఫలితాలను పొందే అవకాశాన్ని కల్పించింది సర్కార్. ముందుగా ఏపీ వాట్సప్ నంబర్‌కు హాయ్ మెసేజ్ చేయాలి.. తరువాత సెలక్ట్




సర్వీస్‌లో విద్యాసేవలు ఆప్షన్‌ను ఎన్నుకోవాలి. అందులో ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలపై క్లిక్ చేసి.. హాల్ టికెట్ నెంబర్, రిజిస్ట్రేషన్ నెంబర్‌ను ఎంటర్ చేసిన వెంటనే ఫలితాలు, ర్యాంక్ కార్డు వచ్చేస్తుంది. ఇక.. ఏపీ ఎడ్‌సెట్ ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో మంత్రి పోస్ట్ చేశారు.

## ఎయిర్‌స్పేస్ తెరిచిన ఇరాన్.. ఢిల్లీకి రానున్న 1,000 మంది భారతీయ విద్యార్థులు

**న్యూఢిల్లీ:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ఉద్ధృతమవుతున్న నేప థ్యంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇండియాకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులు తిరిగి స్వదేశానికి వెళ్లేందుకు వీలుగా ఇప్పటికే మూసి వేసిన ఎయిర్‌స్పేస్‌ను తెరిచింది. దీంతో ఇరాన్ నగరాల్లో చిక్కుకు పోయిన సుమారు 1,000 మంది భారతీయ విద్యార్థులను 'ఆపరే షన్ సింధు' కింద ప్రత్యేక విమానాల్లో న్యూఢిల్లీకి తీసుకు వస్తున్నారు. రాబోయే రెండ్రోజుల్లో వీరంతా ఢిల్లీకి చేరుకుంటారు.


**తొలి విమానం**

కాగా, ఇరాన్‌లో ఉంటున్న భారతీయ విద్యార్థులతో వస్తున్న తొలి విమానం శుక్రవారం రాత్రి 11 గంటలకు న్యూఢిల్లీ చేరే అవకాశం ఉంది. రెండో విమానం శనివారం ఉదయం, మూడో విమానం అదేరోజు సాయంత్రం ఇండియాకు చేరుకుంటాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగుతుం డటంతో దాదాపు అన్ని అంతర్జాతీయ విమానాలకు ఎయిర్‌స్పేస్‌ను ఇరాన్ మూసి వేసింది.

అయితే ఇండియా కోసం ప్రత్యేకమైన క్యారిడార్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి తరలించేందుకు ఇరాన్ ప్రభుత్వం అంగీకరించింది. ఇరాన్‌లో 4,000 మందికి పైగా భారతీయులు నివసిస్తుండగా, వీరిలో సగం మంది విద్యార్థులు ఉన్నారు. 'ఆపరేషన్ సింధు' కింద భారత ప్రభుత్వం 110 మంది భారతీయ విద్యార్థులను ఇప్పటికే న్యూఢిల్లీకి తీసుకు వచ్చింది. వీరంతా ఇరాన్ నుంచి అర్మేనియా చేరుకోవడంతో అక్కడి నుంచి వారిని ప్రత్యేక విమానంలో ఢిల్లీ తీసుకు వచ్చారు.

## గుంటూరు మీదగా..కాకినాడ టౌన్, చర్లపల్లి, లింగంపల్లికి ప్రత్యేక రైళ్లు

**గుంటూరు, (రాజధాని వార్తలు):** గుంటూరు మీదగా చర్లపల్లి, కాకినాడ టౌన్, లింగంపల్లికి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. (07447) కాకినాడ టౌన్-చర్లపల్లి ప్రత్యేక రైలు జూలై 5 నుంచి 2026 మార్చి 28 వరకు ప్రతి శనివారం రాత్రి 8.10కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 8.30కి చర్లపల్లి చేరుకొంటుంది. (07448) చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు జూలై 6 నుంచి మార్చి 29 వరకు ప్రతి ఆదివారం రాత్రి 7.30 గంటలకు బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. (07445) కాకినాడ టౌన్ - లింగంపల్లి ప్రత్యేక రైలు జూలై 2 నుంచి మార్చి 30 వరకు ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో రాత్రి 8.10కి బయలుదేరి గుం టూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 8.50కి లింగంపల్లి చేరుకొంటుంది. (07446)



లింగంపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు జూలై 3 నుంచి మార్చి 31 వరకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో సాయంత్రం 6.30కి బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుందని సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

## అవన్నీ అవాస్తవాలే.. భూమన ఆరోపణలపై స్పందించిన టీటీడీ

**తిరుమల, (రాజధాని వార్తలు):** తిరుమల తిరుపతి దేవస్థానంపై వైఎస్సార్ సీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలపై టీటీడీ బోర్డు స్పందించింది. టీటీడీపై భూమన ఆరోపణలు అవాస్తవాలు, అభూత కల్పనలే అని స్పష్టం చేసింది. భూమన నిర్దిష్టమైన ఆధారాలు లేకుండా టీటీడీ మీద బురద జల్లడం శోచనీయమంటూ మండిపడింది. టీటీడీ బోర్డు ఇంకా ఏమందంటే.. 'శ్రీవారి ఆలయంలో తరతరాలుగా వస్తున్న వేద పారాయణానికి తూట్లు పొడిచే ప్రయత్నం జరుగుతోందని.. వేద పారాయణ చేసే వారితో అవహేళనగా మాట్లాడారనటం పూర్తిగా అవాస్తవం. తిరుమలలోని అన్ని ముఖ్య ప్రాంతాలతో పాటు కాలిబాట మార్గాల్లో కూడా ఓం నమో వేంకటేశాయ నామాన్ని ప్రతిధ్వనించేలా ఏర్పాటు చేశాం. వేద పాఠశాలల్లో వేద విద్యార్థులకు శారీరక, మానసిక దృఢత్వం పెంచే విధంగా కూడా చర్యలు చేపడుతున్నాం. శ్రీవారి ఆలయంలో విధులు నిర్వర్తించే అర్చకులను తనిఖీ చేయడమన్నది పూర్తిగా వాస్తవ దూరం. అర్చకులకు ఇచ్చే గౌరవంలో ఎలాంటి లోటుపాట్లు లేవు. ఆలయం లోపల ఇటీవల కాలంలో అనేక సంస్కరణలు తీసుకురావడం జరిగింది. శ్రీవారి దర్శనాలు, తీర్థ ప్రసాదాలు, తదితర అంశాలపై భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ విధానాన్ని ప్రారంభించి పారదర్శకతకు పెద్దపీట వేశాం. టీటీడీ కేటాయించిన స్థలానికన్నా ఎక్కువ స్థలం ఆక్రమించి నిర్మాణం చేపట్టినందుకు కోర్టు ఆదేశాలు ప్రకారం విశాఖ శారదా పీఠం, మరో రెండు మఠాలకు నోటీసులు జారీ చేశాం. ఏఐ టెక్నాలజీతో దర్శనం చేయిస్తామని చెప్పి.. భక్తులను అడ్డుకుంటున్నారని అవాస్తవాలు పలికే ముందు నిజాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషించి భక్తుల సౌకర్యార్థం శాస్త్రీయ పద్ధతిలో సమయ పాలన పాటిస్తూ.. క్యూలైన్లను పకడ్బందీగా నిర్వహిస్తూ వస్తున్నాం. బయట క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు 22 ఫుడ్ కౌంటర్లను అదనంగా ఏర్పాటు చేసి శ్రీవారి సేవకుల ద్వారా అన్నపానీయాలను అందిస్తున్నాం. చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా వారాంతాల్లో భక్తులకు సౌకర్యవంతమైన దర్శనాలను అందిస్తున్నాం. ఏఐ ప్రాజెక్టు సాకారం కావడానికి టీటీడీ అన్ని చర్యలు తీసుకుంటోంది. 2023 సంవత్సరం పరకామణిలో జరిగిన ఒక సంఘటన కారణంగా ఏర్పడిన అపవాదును తొలగించడానికి ఒక సంవత్సర కాలంగా ఒక పకడ్బందీ వ్యవస్థను ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ వ్యవస్థపై కోల్పోయిన నమ్మకాన్ని పునఃస్థాపించేలా పరకామణిలో ఎస్ఓపీ తయారు చేశాం. ఎవరైనా పరకామణిలో ప్రవేశించాలంటే ఈ ఎస్ఓపీలో పేర్కొన్న విధంగా భద్రతా తనిఖీలు చేయడం జరుగుతుంది. ఇంతటి పకడ్బందీ వ్యవస్థ వల్ల గత సంవత్సర కాలంగా పరకామణిలో ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం' అని పేర్కొంది.

## ఎయిర్‌స్పేస్ తెరిచిన ఇరాన్.. ఢిల్లీకి రానున్న 1,000 మంది భారతీయ విద్యార్థులు




**న్యూఢిల్లీ:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ఉద్ధృతమవుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇండియాకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులు తిరిగి స్వదేశానికి వెళ్లేందుకు వీలుగా ఇప్పటికే మూసివేసిన ఎయిర్‌స్పేస్‌ను తెరిచింది. దీంతో ఇరాన్ నగరాల్లో చిక్కుకుపోయిన సుమారు 1,000 మంది భారతీయ విద్యార్థులను 'ఆపరేషన్ సింధు' కింద ప్రత్యేక విమానాల్లో న్యూఢిల్లీకి తీసుకు వస్తున్నారు. రాబోయే రెండ్రోజుల్లో వీరంతా ఢిల్లీకి చేరుకుంటారు.

**తొలి విమానం**

కాగా, ఇరాన్‌లో ఉంటున్న భారతీయ విద్యార్థులతో వస్తున్న తొలివిమానం శుక్రవారం రాత్రి 11 గంటలకు న్యూఢిల్లీ చేరే అవకాశం ఉంది. రెండో విమానం శనివారం ఉదయం, మూడో విమానం అదేరోజు సాయంత్రం ఇండియాకు చేరుకుంటాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగుతుం డటంతో దాదాపు అన్ని అంతర్జాతీయ విమానాలకు ఎయిర్‌స్పేస్‌ను ఇరాన్ మూసివేసింది. అయితే ఇండియా కోసం ప్రత్యేకమైన క్యారిడార్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి తరలించేందుకు ఇరాన్ ప్రభుత్వం అంగీకరించింది. ఇరాన్‌లో 4,000 మందికి పైగా భారతీయులు నివసిస్తుండగా, వీరిలో సగం మంది విద్యార్థులు ఉన్నారు. 'ఆపరేషన్ సింధు' కింద భారత ప్రభుత్వం 110 మంది భారతీయ విద్యార్థులను ఇప్పటికే న్యూఢిల్లీకి తీసుకు వచ్చింది. వీరంతా ఇరాన్ నుంచి అర్మేనియా చేరుకోవడంతో అక్కడి నుంచి వారిని ప్రత్యేక విమానంలో ఢిల్లీ తీసుకువచ్చారు.




# కండలేరు ఈఈగా బాధ్యతలు స్వీకరించిన గజేంద్ర రెడ్డి

**రాపూరు ప్రతినిధి, (రాజధాని వార్తలు):** రాపూరు మండల పరిధిలోని కండ లేరు జలాశయం డివిజన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా వి గజేంద్ర రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గజేంద్ర రెడ్డి ఇంతకుముందు వెంకటగిరి డివిజన్ నాయుడుపేట సబ్ డివిజన్ డిఈగా పని చేస్తూ పదోన్నతిపై కండలేరు ఈఈగా బాధ్యతలు స్వీకరించారు.

# అంతర్జాతీయ యోగాని ఘనంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లను పక్కాగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం అమరావతి సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూన్ 21 శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ కాన్ఫరెన్సుకు నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాలు నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ,వార్డుస్థాయి నుంచి మండల స్థాయి వరకు 7 వేల ప్రదేశాల్లో సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది అందరూ తమ పరిధిలో ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. అన్ని ప్రదేశాల్లో యోగా ట్రైనర్స్, ఇన్‌చార్జిలను నియమించి కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో సుమారు 10వేల




మందితో సామూహిక యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. యోగాలో పాల్గొన్న వారందరికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. విద్యార్థులు, స్వయం సహాయ సంఘాల మహిళలు, అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత అందరిని పెద్దఎత్తున భాగస్వామ్యం చేస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో నోడల్ ఆఫీసర్ యతిరాజ్, డిఇవో బాలాజీరావు, జడ్పీ సిఇవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోండి

## - మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి

## - జాతీయ రహదారి అధికారులకు లేఖ ద్వారా విజ్ఞప్తి

**ఆత్మకూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు, ముంబాయి జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు, మరణాలు సంభవించకుండా అవసరమైన ప్రత్యేక చర్యలు జాతీయ రహదారి అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు భారత జాతీయ రహదారుల అధికార సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. నెల్లూరు, ముంబాయి జాతీయ రహదారి ఆత్మకూరు నియోజకవర్గంలో సంగం మండలం జెండాదిబ్బ నుండి జిల్లా సరిహద్దు బాట వరకు విస్తరించి ఉందన్నారు. జాతీయ రహదారి నిర్వహణ చాలా నాసిరకంగా ఉందని, ముఖ్యంగా ప్రమాద హెచ్చరికలు లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అంతేకాక సైన్ బోర్డులు, రోడ్డు మార్కింగ్, లైటింగ్, గుంతలు పూడ్చడం డ్రెయిన్లు, జంక్షన్ల అభివృద్ధి లేని కారణంగా ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయని అన్నారు. గతంలోనూ ఈ విషయమై లేఖ ద్వారా అధికారులకు సూచించినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రయాణాలు సాగించే వారికి రక్షణ లేకుండా పోయిందని, ముఖ్యంగా ఆత్మకూరు నియోజక వర్గానికి చెందిన పలువురు ప్రజలు ఈ రోడ్డు ప్రమాదాల కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయమై మా దృష్టికి కూడా తీసుకొ



చ్చారని అన్నారు. వెంటనే అధికారులు ఆత్మకూరు నియోజకవర్గంలోని జాతీయ రహదారి అభివృద్ధి పనులు చేపట్టి అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు జాతీయ రహదారి ప్రమాణాలకు తగ్గట్లుగా రోడ్డు పనులు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నామని అన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పక్కన చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణం

**సైదాపురం, (రాజధాని వార్తలు):** గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన సైదాపురం తహశీల్దార్ కార్యాలయంకు దగ్గరలో మెయిన్ రోడ్డు పక్కన చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణం చేసుకున్నట్లుగా మృతదేహం కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన ప్రకారం చంగనపల్లి రోడ్డు గోకుల బృందావనం రోడ్డు సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలి యని వ్యక్తి మృతదేహం స్థానికులకు కన్పించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతుడికి సుమారు 40 ఏళ్ళ వయస్సు ఉంటుందని, ఒంటిపై నలుపు రంగు షర్టు, బ్లూ రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఈ మృతుడి వివరాలు తెలిసినవారు మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే వారికి సమాచారం ఇవ్వాలని సైదాపురం ఎస్ఐ ఎన్ క్రాంతి కుమార్ 9440796345 ను సంప్రదించాలని కోరారు.



# అర్హులందరికీ ఇల్లు మంజూరు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గ్రామాలలో నిరుపేదలు, ఇంటి స్థలం లేని వారు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని, అర్హులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయడం జరుగుతుందని ఇంచార్జ్ తహసిల్దార్ శోభ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇన్చార్జి తహసిల్దార్ శోభ మాట్లాడుతూ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు మూడు సెంట్లు చొప్పున స్థలం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. 21 గ్రామాల్లో రీ సర్వే చేపట్టడం జరిగిందన్నారు. అలాగే కొత్త రేషన్ కార్డులకు సంబంధించి 2 వేల మంది కొత్తగా నమోదు చేసుకోవడం జరిగిందని జూలై మొదటి వారంలో అందజేస్తున్నట్లు తెలిపారు. ఇంతవరకు గజపతి నగరం పురిటి పెంట గ్రామాలకు సంబంధించి 174 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆర్డబ్ల్యూఎస్ జే.ఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటింటికి తాగునీటి పథకం కింద రెండో విడతలో 20 కోట్ల నిధులు మంజూరు జరిగాయని, ఈ నెలాఖరులోగా గ్రామాలలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏ పి ఎం కృష్ణవేణి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో నిర్మాణాలు చేపట్టిన 79 లక్షల నిధులు మంజూరు జరిగినట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్ రావడంతో గ్రామీణ ప్రాంతాలలో సాగునీటి కాలవల మరమ్మతులకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి కిరణ్ కుమార్ తెలియజేశారు. మండలంలోని 8,400 మంది రైతులకు మొదటి విడతలో అన్నదాత సుఖీభవ అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గార తవుడు ,వైస్ ఎంపీపీ గెద్ద దమయంతి, ఎంపీడీవో బి.కళ్యాణి ,సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# వితంతువులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన పి.ఎడ్వర్డ్




**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** బుచ్చి పట్టణం అంబేద్కర్ నగర్‌లో గల ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చ్ కాపరి డి. దేవదానం, నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణం ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ ఆత్మకూరు వారిని చర్చి నందు వితంతువులు పేదవారు ఉన్నారని నిత్యవసర సరుకులు పంపిణీ అవసరంగా ఉన్నది ఇవ్వవలసిందిగా కోరినారు. వారి కోరిక మేరకు నిత్యవసర సరుకులు పంపిణీ పి.ఎడ్వర్డ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి డి.దేవదానం బ్రదర్ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహకులు పి ఎడ్వర్డ్ మాట్లాడుతూ పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తూ ఉన్నామని తెలియజేశారు.

# ఐటిఐ పాస్ అయితే మరిన్ని ఉద్యోగాలు : ప్రిన్సిపాల్ మురళీధర్



**సంగం, (రాజధాని వార్తలు):** విద్యార్థిని విద్యార్థులు ఐటిఐ చదివి పాస్ అయితే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగాలు పొందవచ్చని ప్రిన్సిపల్ మురళీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఐ.టి.ఐలో రెండవ విడత ప్రవేశానికి ధరఖాల స్వీకరిస్తున్నట్లు అని తెలిపారు. 2025 - 2026 విద్యా సంవత్సరమునకు గాను, హైరెక్టరు, ఉపాధీ మరియు శిక్షణా సంస్థ వారి ఆదేశాల మేరకు సంగం ఐ.టి.ఐ నందు పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తులు కోరడమైందని తెలిపారు. 19.06.2025 తేది నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్థులు చేసుకొనవచ్చు, ఆన్లైన్ ద్వారా దరఖాస్థు చేయుటకు iti.ap.gov.in website నందు 15.07.2025 వరకు అందుబాటులో ఉంటుంది అని మున్సిపల్ మురళీధర్ తెలియజేశారు. గవర్నమెంట్ ఐటిఐ సంగం నందు ఎలక్ట్రిషియన్ మరియు ఫిట్టర్" మాత్రమే సీట్లు ఉన్నాయని ,దరఖాస్తు చేసుకున్న విద్యార్థి, విద్యార్థులు 21.07.2025 తేదిన ఉదయం 10-00 గంటలకు గవర్నమెంటు పాలిటెక్నిక్ క్యాంపస్, ఆత్మకూరులో గల గవర్నమెంట్ ఐటిఐ, నందు ఒరిజినల్ సర్టిఫికేట్‌తో కౌన్సిలింగ్‌కి హాజరు కావాలని మరియు ఇతర వివరముల కొరకు ఈ క్రింది నెంబర్లును 9866720544, 9963950604,7671861779, 6300599477, 9985169099 సంప్రదించాలని ప్రిన్సిపాల్ మురళీధర్ తెలిపారు.

# జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజలతో భాగస్వాములు అవ్వాలి : జిల్లా ఎస్.పి. జి.కృష్ణకాంత్






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం ప్రజలతో భాగస్వాములయ్యేలా కార్యచరణ రూపకల్పన అయ్యే విధంగా చూడాలని జిల్లా ఎస్పీ జి కృష్ణకాంత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా యస్.పి. ఆదేశాల మేరకు, అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సూచనలతో, జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజలతో భాగస్వాములయ్యేలా కార్యాచరణ రూపకల్పన, జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఆట కట్టించుటకు ఆయా గ్రామాలలోని గ్రామస్తులు, గ్రామ పెద్దలతో మరియు యువతతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆయా పరిధిలోని గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలోని సమస్యలు, ఆస్థి నేరాలు, నివారణ చర్యలు, సైబర్ మోసాల గురించి, గాంజా, ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి, మహిళలు మరియు బాలబాలికలపై జరిగే నేరాలు, ఇతర చట్టాలు, శిక్షలు గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.గ్రామాల్లో తగాదాలు, గొడవలు పడరాదని, అందరూ కలిసి మెలిసి సామరస్యంగా జీవించాలని తెలియజేశారు. ఇసుక, మద్యం, గంజాయి ఇతర నిషేధిత వస్తువుల



అక్రమ రవాణా అడ్డుకట్ట వేయడానికి గ్రామస్థులు సహకారం అందించాలని సూచించారు. ఆయా పరిధిలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా. చెడునడత, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్నవారికి పోలీస్ అధికారుల కౌన్సిలింగ్ నిర్వహణ,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారుల హెచ్చరించారు. ఎవరికైనా అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే డయల్ 112 లేదా ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కి తెలియజేయాలని తెలిపారు.

# కుబేర మూవీ.. నాగ్ అశ్విన్ ఘాటైన రివ్యూ చూశారా?





టాలీవుడ్ కింగ్ నాగార్జున, కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న లీడ్ రోల్స్‌లో నటించిన కుబేర వరల్డ్ వైడ్‌గా నేడు రిలీజ్ అయిన విషయం తెలిసిందే. ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఆ సినిమాను అమిగోస్ క్రియేషన్స్, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ బ్యానర్లు భారీ బడ్జెట్ తో నిర్మించాయి. సునీల్ నారంగ్, పుష్కర్ రామ్మోహన్‌రావు, శేఖర్ కమ్ముల నిర్మించిన కుబేర మూవీలో జిమ్ సర్భ్, దలీప్ తాహిల్, సాయాజీ షిండే, దివ్య డెకాటే, సాయాజీ షిండే తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సినిమాపై రిలీజ్‌కు ముందే ఆడియన్స్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రమోషనల్ ఈవెంట్స్‌తో వేరే లెవెల్ హైప్ క్రియేట్ చేశారు మేకర్స్. హైదరాబాద్, ముంబై, చెన్నైలో నిర్వహించిన ప్రమోషనల్ ఈవెంట్స్‌తో కచ్చితంగా మూవీ చూడాలనేంతగా బజ్ సృష్టించారు. శేఖర్ కమ్ముల తన రొటీన్ స్టైల్‌కు భిన్నంగా పొలిటికల్, క్రైమ్ యాంగిల్ టచ్ చేయడంతో కుబేర కోసం అంతా వెయిట్ చేశారు. ఇప్పుడు సినిమా మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. సినీ ప్రియులను ఓ రేంజ్‌లో మెప్పిస్తోంది. సినిమా చాలా బాగుందని మూవీ లవర్స్ రివ్యూస్ ఇస్తున్నారు. ఓ బిచ్చగాడు ప్రభుత్వాన్ని ఏ విధంగా ప్రమాదంలో పడేసేలా చేశాడనేది కీ పాయింట్ అని, అది సూపర్ అని చెబుతున్నారు. ఓవరాల్‌గా వాస్తవికతకు దగ్గరగా శేఖర్ కమ్ముల మరోసారి సినిమా తీశారని అంటున్నారు. థ్రిల్లింగ్ పాయింట్‌తో తెరకెక్కించిన విధానాన్ని కొనియాడుతున్నారు. ఇప్పుడు కుబేర మూవీపై మరో టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ పోస్ట్ పెట్టారు. సినిమాను చూసిన ఆయన.. తనదైన రీతిలో రివ్యూ ఇచ్చారు. తెరపై 25 ఏళ్ల శేఖర్ కమ్ముల కెరీర్ అంటూ వచ్చిన స్క్రీన్ షాట్‌ను షేర్ చేశారు. ఆ తర్వాత మాస్టర్ ఫలికింగ్ పీస్.. ఆలోచించకండి.. సినిమాకు వెళ్లండి అంటూ రాసుకొచ్చారు డైరెక్టర్ నాగ్ అశ్విన్. ప్రస్తుతం ఆయన ఇచ్చిన రివ్యూ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నాగ్ అశ్విన్‌కు సినిమా బాగా నచ్చినట్లు ఉందని అనేక మంది నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సినిమాను చూసిన వారు.. అవును నిజమే.. కుబేర మాస్టర్ పీస్ అంటూ కొనియాడుతున్నారు. మూవీ చూడని వారు.. కచ్చితంగా చూసేయాలని అని చెబుతున్నారు. మరి ఓవరాల్‌గా కుబేర చిత్రం ఎలాంటి విజయం సాధిస్తుందో వేచి చూడాలి.

# అదే టైగర్ పేరు.. చరణ్ కూతురు క్లీన్ కారా గుర్తుగా బర్త్‌డే పోస్ట్ వైరల్!



మెగా ఫ్యామిలీలో ఇప్పుడు ఫుల్ ఫ్యామిలీతో ఆడుకోగలిగే వయసు వచ్చింది క్లీన్ కారాకు. రామ్ చరణ్, ఉపాసన దంపతులు తల్లిదండ్రులయ్యి సంవత్సరం దాటుతోంది. తన కూతురు క్లీన్ కారా జన్మదినాన్ని ప్రత్యేకంగా సెలబ్రేట్ చేస్తూ ఉపాసన చేసిన తాజా పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో ముద్దుగా కనిపిస్తున్న టైగర్ కబ్, ఉపాసన చేతిలో క్లీన్ కారా ఉన్న ఫోటోలు అభిమానుల మనసులను గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా ఉపాసన తన పోస్టులో, “సరిగ్గా సంవత్సరం క్రితం, ఈ టైగర్ కబ్ పుట్టింది. ఇప్పుడు అది ఎంతో చురుకైన టైగ్రెస్‌గా మారింది. ఇది ఇప్పుడు మా క్లీన్ కారాతో తన పేరును పంచుకుంటోంది. ఈ ప్రత్యేక గిఫ్ట్‌కి హైదరాబాద్ జూ సూపర్ కృతజ్ఞతలు” అంటూ పేర్కొన్నారు. ఫోటోలలో ఒక దానిలో పసివాడిగా టైగర్ కబ్, మరొకదిలో పెద్దగా పెరిగిన టైగ్రెస్‌ను ఆమె కూతురితో కలిసి చూసిన మూమెంట్ ఉంది. ఈ ఫోటోలు ద్వారా వారు తీసుకున్న కేర్ డెడికేషన్ స్పష్టంగా కనిపిస్తుంది. టైగ్రెస్‌కు క్లీన్ కారా పేరు పెట్టడమే కాదు, “వన్యప్రాణులు అడవిలోనే ఉండాలి, అయితే అతి పెద్ద గౌరవంతో వాటిని సంరక్షించే ప్రయత్నాలను మేము మద్దతు ఇస్తాం” అంటూ ఉపాసన భావోద్వేగంగా వెల్లడించారు. క్లీన్ కారా బర్త్‌డే సందర్భంగా ఇలా ఒక టైగ్రెస్‌కు తన పేరును పెట్టడం మెగా ఫ్యామిలీని ప్రేమించే ప్రతి ఒక్కరినీ హత్తుకుంది. ఈ పోస్ట్‌లో ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ కూడా స్పందిస్తూ, “అత్యంత మధురం. మీ ముద్దుల లిటిల్ కబ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు” అంటూ కామెంట్ చేశారు. ఇదే సమయంలో ఎంతో మంది సెలబ్రిటీలు, ఫ్యాన్స్ కూడా తమ శుభాకాంక్షలను తెలియజేశారు. ఇలా రామ్ చరణ్ – ఉపాసన కూతురి బర్త్‌డే సెలెబ్రేషన్ సోషల్ మీడియాలో హడావిడిగా మారింది. ఇక రామ్ చరణ్ గతంలో ఓ ఇంటర్వ్యూలో “నన్ను క్లీన్ కారా నాన్న అని పిలిచే రోజే, అందరికీ ఆమెను పరిచయం చేస్తాను” అని చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పటికీ వారు తమ కూతురి ముఖాన్ని పూర్తిగా రివీల్ చేయకపోయినా, ఈ పిక్స్ మాత్రం భావోద్వేగాలను వ్యక్తపరచేలా ఉన్నాయి. ఇక మెగా డాటర్ దర్శనం ఎన్నటికీ జరుగుతుందో చూడాలి.

# మాలీవుడ్‌లోకి టాలీవుడ్ ప్రొడ్యూసర్.. డెబ్యూ సక్సెస్






సినీ పరిశ్రమలో పాన్ ఇండియా ట్రెండ్ స్టార్ట్ అయ్యాక.. ఓ ఇండస్ట్రీకి చెందిన దర్శకులు, నిర్మాతలు, హీరోలు సహా అంతా.. వేరే ఇండస్ట్రీకి వెళ్ళి లక్ టెస్ట్ చేసుకుంటున్న విషయం తెలిసిందే. అందులో చాలా మంది డెబ్యూతోనే మంచి సక్సెస్ అందుకుంటున్నారు. ఆ తర్వాత ప్రాజెక్ట్‌లపై కూడా ఫోకస్ పెడుతున్నారు. ఆ లిస్ట్‌లో మరో తెలుగు ప్రొడ్యూసర్ చేరారు. నేచురల్ స్టార్ నాని కృష్ణార్జున యుద్ధం మూవీతో నిర్మాతగా మారిన సాహు గారపాటి.. ఇప్పటికే తెలుగులో వివిధ చిత్రాలను నిర్మించారు. మజిలీ, టక్ జగదీష్, ఉగ్రం సినిమాలను రూపొందించిన ఆయన.. నటసింహం బాలకృష్ణతో భగవంత్ కేసరి తీసి సూపర్ హిట్ అందుకున్నారు. రీసెంట్‌గా మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా లైలా మూవీని నిర్మించారు. ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న మెగా 157 ప్రాజెక్టుకు ఆయన నిర్మాతగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. షైన్ స్క్రీన్స్ బ్యానర్ అధినేత అయిన సాహు గారపాటి.. రీసెంట్‌గా మలయాళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. వ్యసన సమేతం బంధుమిత్రాదికల్ సినిమాను నిర్మించారు. అనశ్వర రాజన్ ప్రధాన పాత్రలో నటించిన ఆ మూవీకి సహ నిర్మాతగా వ్యవహరించగా.. జూన్ 13వ తేదీన సినిమా థియేటర్స్‌లో రిలీజ్ అయింది. ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంటున్న ఆ మూవీ.. విమర్శకుల నుంచి ప్రశంసలు కూడా అందుకుంటోంది. ఇప్పుడు హైదరాబాద్‌లోని వివిధ మల్టీప్లెక్సుల్లో కూడా ప్రదర్శితమవుతోంది. అంత్యక్రియల నేపథ్యంలో రూపొందిన ఆ మూవీ.. డార్క్ కామెడీ జోనర్‌లో తెరకెక్కింది. కుటుంబ సంబంధాలు, సామాజిక చిత్రాలు వంటి వివిధ ఇతివృత్తాల ఆధారంగా రూపొందింది. ఎస్ విపిన్ సినిమాకు దర్శకత్వం వహిస్తూ.. నిర్మాణంలో కూడా భాగమయ్యారు. మొత్తానికి డెబ్యూతో మాలీవుడ్‌లో సక్సెస్ అందుకున్నారు సాహు గారపాటి.

అయితే ఇప్పటికే చాలా మంది తెలుగు నిర్మాతలు ఇతర చిత్ర పరిశ్రమల్లో అడుగుపెట్టి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇటీవల కాలంలో అల్లు అరవింద్, దిల్ రాజు రెండు హిందీ చిత్రాలను నిర్మించారు. మైత్రి మూవీ మేకర్స్.. తమిళంలో గుడ్ బ్యాడ్ అగ్లీ, మలయాళంలో నదికర్ చిత్రాలు నిర్మించింది. కోలీవుడ్‌లో మరికొన్ని ప్రాజెక్టులను లైన్‌లో పెట్టింది. మరి సాహు గారపాటి.. మిగతా ఇండస్ట్రీల్లోకి కూడా వెళ్తారేమో వేచి చూడాలి.

# రౌడీ 'కింగ్‌డమ్'లో ఏం జరుగుతోంది? ఎందుకీ కన్ఫ్యూజన్?



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటించిన పాన్ ఇండియా మూవీ 'కింగ్‌డమ్'. గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో 'మిస్టర్ బచ్చన్' ఫేమ్ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. షూటింగ్ పూర్తి చేసుకున్నా ఇంత వరకు ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్ కన్ఫర్మ్ కాకపోవడం రౌడీ ఫ్యాన్స్‌ని కలవరానికి గురి చేస్తోంది. ఇప్పటికే చాలా సార్లు ఈ మూవీ రిలీజ్ డేట్ వాయిదా పడుతూ వస్తోంది. జూలై 25న రిలీజ్ అవుతోందని మాత్రం కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే మేకర్స్ మాత్రం జూలై 25న కానీ లేదా ఆగస్టు 1న కానీ ఈ మూవీని రిలీజ్ చేయాలని ఆలోచిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇంతకుముందు 'కింగ్‌డమ్'ని జూలై 4న రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. అంతకు ముందు మే 30న రిలీజ్ కావాల్సింది. అయితే టీమ్ ఈ డెడ్ లైన్‌లని సీరియస్‌గా తీసుకోలేదు. సినిమాని ఆ టైమ్‌కు రెడీ చేయలేకపోయారు. దీంతో 'కింగ్‌డమ్' రిలీజ్ నిరవధికంగా వాయిదాపడుతూ వస్తోంది. ఇదే సమయంలో పవన్ నటించిన పాన్ ఇండియా మూవీ హరి హర వీరమల్లు, కింగ్‌డమ్ టీమ్‌ని మరింతగా కన్ఫ్యూజ్ చేస్తోంది. గత కొంత కాలంగా రిలీజ్ వాయిదా వేస్తూ వస్తున్న టీమ్ ఈ మూవీని జూలై 24న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారట. ఇదే ఇప్పుడు 'కింగ్‌డమ్'ని ఇరుకున పెట్టేస్తోంది. 'హరి హర వీరమల్లు' రిలీజ్ జూలైలో ఖచ్చితంగా ఉంటే రేస్ నుంచి 'కింగ్‌డమ్'ని తప్పించి మరో డేట్‌ని ఫైనల్ చేసుకోవాలని నిర్మాత సూర్యదేవర నాగవంశీ భావిస్తున్నాడట. కానీ హరి హర వీరమల్లు టీమ్ మాత్రం ఈ విషయంలో ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండా కన్ఫ్యూజన్‌కు గురి చేస్తూ తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తోంది. జూలై 25న కింగ్‌డమ్‌ని రిలీజ్ చేయకపోతే ఆ తరువాత రేసులోకి తమ్ముడు వచ్చేస్తోంది. దాని తరువాత వద్దాములే అనుకుంటే వార్ 2, కూలీ సినిమాలు వచ్చేస్తున్నాయి. వాటికి ముందు రిలీజ్ చేయాలనుకుంటే 'కింగ్‌డమ్‌కు కేవలం రెండు వారాలు మాత్రమే కలెక్షన్‌లు రాబట్టుకునే టైమ్ ఉంటుంది. ఇప్పటికే వరుస వాయిదాల కారణంగా కింగ్‌డమ్‌పై నెగెటివ్ టాక్ వైరల్ అవుతోంది. దీనికి తోడు ఓటీటీ ప్లాట్ ఫామ్ ఒత్తిడి కూడా తోడవ్వడంతో సినిమా ప్రమోషన్స్‌కు అనుకున్న టైమ్ కూడా దక్కేలా కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు. రిలీజ్ డేట్ విషయంలో ఇప్పటికీ గందరగోళం నెలకొన్న నేపథ్యంలో కింగ్‌డమ్ ప్రమోషన్స్‌కు అసలు టైమ్ ఉంటుందా? అని ట్రేడ్ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. హరి హర వీరమల్లు కన్ఫ్యూజన్‌లో కింగ్‌డమ్ రిలీజ్ డేట్‌ని ఫైనల్ చేయలేకపోతున్న నిర్మాత ఇప్పటికైనా సరైన రిలీజ్ డేట్‌ని ఫైనల్ చేయాలని, లేకుండా సినిమాపై ఉన్న బజ్ పూర్తిగా పోయే ప్రమాదం ఉందని ఇన్ సైడ్ టాక్.

# "రెవెన్యూ డే" సందర్భంగా జెండా వందనం కార్యక్రమం







**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన జూన్ నెల 20వ తారీఖున "రెవెన్యూ డే" సందర్భంగా ఈరోజు శ్రీకాకుళంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌నందు జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షులు గౌరవ కె శ్రీరాములుచే జెండావందనం కార్యక్రమం నిర్వహించడమైనది. తదుపరి రెవెన్యూ శాఖ ఔన్నత్యం రెవెన్యూ శాఖ పుట్టుక రెవెన్యూ శాఖ విధులు రెవెన్యూ శాఖ ప్రజలతో మమేకమై నిర్వహించాల్సిన ప్రభుత్వ కార్యక్రమాలు గురించి పెద్దలు మాట్లాడారు. తదుపరి రెవెన్యూ సర్వీసుల సంఘం తరపున పెద్దలు రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులను సన్మానించడమైనది. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘ కార్యదర్శి డి.చంద్రశేఖర్, ఏపిఆర్ఎస్ఏ పూర్వపు అధ్యక్షులు ఎం.వి.సూర్యనారాయణ, ఎం.కాశీప్రసాద్, ఏపీజేఏసి అమరావతి మహిళా విభాగం అధ్యక్షురాలు కె.ప్రవల్లిక ప్రియ, ఏపిఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్.రాజు, ట్రెజరర్ మురళీధర్ నాయక్, సోని కిరణ్, జి కె శ్రీనివాసరావు, ప్రకాశరావు, విఆర్ఓల సంఘం నుండి శాస్త్రి, రాంజీ, డిల్లేశ్వరరావు తదితరులు విఆర్ఏల సంఘం నుండి జి.వెంకటప్పారావు, అప్పలనాయుడు, రామారావు, త్రినాథ, ప్రసాదు తదితరులు పెద్దయెత్తున రెవెన్యూ సంఘ సభ్యులు మరియు రెవెన్యూ ఉద్యోగుల పాల్గొని రెవెన్యూ డే వేడుకను ఆహ్లాదకరంగా జరుపుకోవడమైనది.





# యోగాసనాలు వేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



**భీమిలి, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసన సభ్యులు జీవి ఆంజనేయులు భీమిలిలోని ప్రభుత్వ అతిథి నివాసంలో శుక్రవారం ఉదయం యోగాసనాలు వేశారు. యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. యోగాతో ఆరోగ్యం, మనశ్శాంతి కలుగుతుందని, ప్రతి రోజు యోగాను దినచర్యగా చేసుకోవాలని కోరారు.

# శ్రీ మహా కామేశ్వర స్వామి దేవాలయంలో ఎంఎల్‌ఏ గంటా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నంలో మధురవాడలో కొలువైన శ్రీ మహా కామేశ్వర స్వామి దేవాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మరియు శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం, జీవి మరియు గంటా స్వామివారికి విశేష పూజలు చేసి ఆశీస్సులు అందుకున్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పాఠశాల ఉంది... కానీ బోధన లేదు

## - పాఠశాల ప్రారంభమై పది రోజులు అయినా తరగతులు లేవు




**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** వేసవి సెలవులు ముగిశాక పాఠశాలలు తిరిగి ప్రారంభమై దాదాపు పది రోజులు గడుస్తున్నా, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం బలపం పంచాయతీ పరిధిలో గిల్లాల బంధ ప్రాథమిక పాఠశాలలో మాత్రం ఇప్పటికీ తరగతులు ప్రారంభం కావడం లేదు. ఈ పాఠశాలలో 12 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల నియామకం జరగకపోవడం గమనార్హం. ఉపాధ్యాయులు లేని పరిస్థితిలో విద్యార్థులు మట్టినేలపై కూర్చుని, ఉపాధ్యాయులు వస్తారన్న ఆశతో రోజూ పాఠశాల బాట పడుతున్నారు. తాళపు తలపందిరిలో, కనీస వసతుల్లేని ఈ పాఠశాలలో విద్యార్థులు ఎదురు చూపుల్లో నిలిచిన దృశ్యం హృదయాన్ని కలచి వేస్తోంది. గతేడాది ఈ పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసిన ఉపాధ్యాయురాలు ప్రభుత్వం ఆమోదించకపోవడంతో తొలగించబడి, ఇప్పటివరకు కొత్తగా ఎవరినీ నియమించకపోవడంతో ఈ స్థితి నెలకొందని స్థానికులు తెలిపారు. ఇక ప్రభుత్వం ఒకవైపు 'మనం బడి' – 'నాడు–నేడు' వంటి పథకాల ద్వారా విద్యను అభివృద్ధి చేస్తామని చెబుతుండగా, మరోవైపు ఈ మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులు ఆ పథకాల ఫలమును ఆస్వాదించలేకపోతుండటం దురదృష్టకరం. గిల్లాల బంధతో పాటు కుడుముల, కోరుకొండ వంటి పాఠశాలల్లో కూడా ఇలాంటి సమస్యలు ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. పిల్లల భవిష్యత్తు దెబ్బతినకూడదు... వెంటనే ఉపాధ్యాయుడిని నియమించాలి" అంటూ గ్రామస్తులు, తల్లిదండ్రులు విద్యాశాఖను కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే పోరాటానికి సిద్ధమవుతున్నామని గ్రామ పెద్దలు హెచ్చరిస్తున్నారు.

# 130 పరుపులు వసతి గృహంలోని విద్యార్థులకు అందజేత




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** రోటరీ క్లబ్ అనకాపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో గుండాల జంక్షన్ వద్ద ఉన్న వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహమునకు శనివారం సుమారు 1 లక్ష 50 విలువ చేసే 130 పరుపులను గ్రాంట్ చైర్మన్ పి డి జి విశ్వనాథ్ హాస్టల్ వార్డెన్ ఓ తబిత, విద్యార్థులకు వసతి గృహంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అనకాపల్లి అధ్యక్షులు సరిపల్లి రాజేష్, కార్యదర్శి అనిల్, అనకాపల్లి రోటరీ క్లబ్ ఈ ప్రాజెక్ట్ చైర్మన్ కర్రిశెట్టి సతీష్, బుద్ధ రమణాజీ, అరేపు కామేష్, సానా త్రినాథ్, సర్వారం, ఎస్ కృష్ణ మరియు అధిక సంఖ్యలో రోటరీ క్లబ్ సభ్యులు హాస్టల్ విద్యార్థినులు పాల్గొనడం జరిగింది.

# విశాఖ విమానాశ్రయంలో నారా లోకేష్‌కి స్వాగతం పలికిన బుద్ధ నాగ జగదీష్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈనెల 21వ తేదీ విశాఖపట్నంలో జరిగే కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విద్య ఐటీ శాఖామాత్యులు నారా లోకేష్ ఈరోజు విశాఖపట్నం వస్తున్న సందర్భంగా విశాఖపట్నం విమానాశ్రయంలో కలుసుకొని స్వాగతం పలికిన సందర్భంగా నారా లోకేష్ శాలువా వేస్తున్న మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీష్‌ను ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు వారించి తిరిగి వారికి శాలువాతో లోకేష్ సత్కరించారు.

# దాతల సహకారంతోనే నిరుపేదల జీవితాల్లో వెలుగులు

## - మనసు అనాధాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందించిన గంట్ల



**సింహాచలం, (రాజధాని వార్తలు):** దాతల సహకారంతోనే సమాజంలో పేదరికం తగ్గుతుందని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, నేవల్ డాక్ యార్డ్ కేటీబి అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు. గంట్ల శ్రీనుబాబు ఆకాంక్షించారు. శుక్రవారం ఇక్కడ సింహాచలం రోడ్‌లో ఉన్న మనసు అనాధాశ్రమానికి గంట్ల శ్రీనుబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి అక్కడ పిల్లలకు అవసరమైన నిత్యవసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ ఏడాదిలో రెండు మూడు పర్యాయాలు ఇక్కడ పిల్లలకి అవసరమైన సామాగ్రిని తన పరిధి మీద అందజేస్తూ వస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా మరికొంత సామగ్రిని అందజేయనున్నట్లు తెలియచేసారు.. ఈ ఆశ్రమంలో సుమారు 32 మంది పిల్లలుఉండగా వారంతా పలు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్నత విద్యాభ్యాసం సాగిస్తున్నారని అందుకు సహాయం చేసిన దాతలు, కృషి చేసిన నిర్వాహకులు ప్రవీణ్ పార్వతిలను గట్ల శ్రీనుబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో సింహగిరి గ్యాస్ ఏజెన్సీ యజమాని గంట్ల కిరణ్ బాబు, మారుతి కన్వెన్షన్స్ యజమాని టి సుధీర్, గంట్ల ఎరుకులమ్మ, సత్యవతి, శివాజీ, హర్ష వర్ధన్, హనీష, పాల్గొన్నారు.

# విశాఖ యోగా వేడుకల్లో చింతపల్లి విద్యార్థుల జోరు

## - చింతపల్లి గిరిజన ఆశ్రమాల నుంచి 800 మంది పైగా విద్యార్థుల బస్సుల ర్యాలీ





**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** విశాఖపట్నంలో నేడు నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ రాష్ట్రస్థాయి వేడుకలకు చింతపల్లి నుంచి విద్యార్థులు బస్సుల్లో విస్తారంగా తరలివెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ మహోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో చింతపల్లి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర మరియు బాలికల పాఠశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థులు, యోగ వాలంటీర్లు, ఏఎన్ఎంలు, మహిళా సంరక్షకురాళ్లు విశాఖపట్నానికి తరలించబడ్డారు. ఏపీఎస్ ఆర్టీసీ చింతపల్లి డిపో ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులు శుక్రవారం ఉదయం నిండుగా నిండిన విద్యార్థులతో నగరానికి బయలుదేరాయి. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు విద్యార్థులకు ముందస్తు యోగ శిక్షణ నిర్వహించడంతో పాటు, యోగ శిక్షకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒకే సమయంలో వందలాది మంది విద్యార్థులు, సిబ్బందితో కూడిన బస్సుల ర్యాలీ స్థానికంగా ఆసక్తికర దృశ్యంగా మారింది. యోగా గురించి అవగాహన కల్పించే దిశగా ఈ తరలింపు కార్యక్రమం చింతపల్లిలో గొప్ప ప్రతిస్పందన కలిగించిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan